
# వెండి చెంబు



-పి. చంద్రశేఖర అజాద్

'వెండిచెంబు'ను తలుచుకుంటే చాలు ఓ గంట క్రితం వరకు రాంబాబుకు పులకరింత. అతనెప్పుడూ ఇత్తడి చెంబుల్నే చూశాడు. ఒక్క నాయనమ్మ మాత్రం రాగిచెంబులో మంచినీళ్ళు పోసుకొని తాగేది. రాంబాబు బాల్యం నుండి యవ్వనం దాకా - ఇత్తడి చెంబు అతనిలో విడదీయరాని భాగం. స్నానం చేయటానికి అదే. కట్టకు వెళ్ళి రావటానికీ అదే. అదేంటో 'ఇత్తడి'కి చిలుము ఎక్కువ. ఎప్పటికప్పుడు తోమకపోతే దాని తళతళలే కనిపించవు. మామూలుగా చెంబుల్ని తోమేది ఆడవారయినా, తన చెంబుని రాంబాబే తోముకునేవాడు. తనతోపాటు బయటకు తీసుకు వెళ్తున్నప్పుడు ఆ మాత్రం మెరుపూ, హుందా వుండాలని అతని ఆరాటం.

అతని పెళ్ళి సమయంలో కట్నం ఎంతిస్తారు అని కాకుండా, 'వెండి చెంబు' ఇస్తే బాగుంటుందేమో అనుకున్నాడు. నోరు తెరిచి అడగలేదు గాని, అలకపాన్పులో 'వెండి చెంబు'నే అడుగుదామని ఉబలాట పడ్డాడు. రాంబాబు మొదటిరోజు తన భార్యతో " ఈ ప్రపంచంలో నాకు అత్యంత ఇష్టమైంది వెండి చెంబు" అన్నప్పుడు ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రాంబాబు వాటిని ఆనంద బాష్పాలు అనుకున్నాడు. రాంబాబు భార్య తులసి పొద్దున్నే తన అమ్మమ్మ భుజంమీద తలపెట్టి ఏడుస్తుంటే ఆమె కంగారుపడింది. తీరిగ్గా అసలు విషయం తెలుసుకున్నాక కడుపు చేత్తో పట్టుకుని నవ్వేసింది.

" ఓస్ ఇంతేనా! కార్యం గదిలోంచి వచ్చిన ఆడపిల్ల ఏడ్చిందంటే ఆ కాపురం చట్టుబండలయినట్టే. అనవసరంగా నన్ను కంగారు పెట్టేశావ్" అని ఇంకోసారి నవ్వింది.

"అమ్మమ్మా... నా బతుకు నీకంత నవ్వు తెప్పిస్తుందా" అంది కోపంగా.

"అయ్యో - నా పిచ్చితల్లీ. నీ బతుక్కేంటే- వెండి. సొంతం మూడు రోజుల శోభనం పూర్తి కాలేదు. అంతలోనే ఇంత వైరాగ్యం తగదు. ఏ మగాడన్నా, మొదటిరోజు 'నిన్ను ప్రేమిస్తున్నా' అని చెప్పాడనుకో. ఆడిమీద ఓ కన్నేసి వుంచాలి"

"ఎందుకమ్మమ్మా?" అంది అనుమానంగా

"దాన్నే కొత్త పిచ్చి అంటారు. అది తీరితే - ఇంకొకర్ని ప్రేమిస్తాడు. అయినా శోభనం రోజు రంభలాంటి నిన్ను ఎదురుగా పెట్టుకుని వెండి చెంబంటే ఇష్టం అని చెప్పాడంటే ఒకటే - ఆ మనిషితో నీకు ఏ గొడవా రాదు"

"అదెలా?"అంది తులసి

"మనుషుల్ని కాక వస్తువుల్ని ఇష్టపడేవాడు - ఎంత అందమైన ఆడపిల్ల కనిపించినా చలించడు. వాడు మెడలో గొలుసుల కోసం చూస్తాడు గానీ - మెడ కిందకి చూడడు" అనగానే

"ఛో... అమ్మమ్మా" అని సిగ్గుపడి వెళ్ళి పోయింది.

అదిగో ఆ విధంబుగా- అప్పుడప్పుడూ రాంబాబు "వెండి చెంబు" విషయంలో ఇతరులకు కాస్త చులకనయ్యాడు. అతనికి 'వెండి' చెంబుని కొనుక్కోవాలనే కోరిక మాత్రం తీరలేదు. ఎప్పుడు ఖాళీ దొరికితే అప్పుడు వెండి షాపుల దగ్గరకెళ్ళి చూస్తుండేవాడు. ఒకరిద్దరికి వీడు ఏ గజదొంగో కాదుగదా అనే అనుమానమూ వచ్చింది. తులసి ఒకటి రెండుసార్లు రాంబాబుతో కలసి ఆ షాపుకి వెళ్ళి చిన్న చిన్న వెండి వస్తువులు కొనటం వల్ల ఆ అనుమానం కొంత తరిగింది గాని, షాపు నుండి బయటకు వెళ్ళేంత వరకూ - ఓ కన్ను రాంబాబు మీద వేసి వుంచుతారు.

అలాంటి 'రాంబాబు'కు దూరపు బంధువు 'వెంకీ' కొత్తగా ఇల్లు కట్టుకొని గృహ ప్రవేశానికి పిలిచినప్పుడు తన చిరకాల వాంఛ నెరవేర బోతుందని తెలియదు. 'వెంకీ' ఆ ఇంట్లో సత్య నారాయణ వ్రతం చేయించాక అందరికీ 'వెండి చెంబులు' యిచ్చాడు. అప్పుడు రాంబాబు ఆనందానికి అవధులు లేవు. ముఖం అప్పుడే చింతపండు పెట్టి తోమిన ఇత్తడి చెంబులా మెరిసిపోయింది.

'సోదరా- అపూర్వం - అనితరసాధ్యం. నీకు ఇంత గొప్ప టేస్టుందని నాకు తెలియదు. కరి వేపాకన్నా - చెంబన్నా మనవాళ్ళు చాలా చులకనగా చూస్తారు. నువ్వు వాటికో గౌరవం తెచ్చావ్. నువ్వు యింకా యింకా ఎదిగి ఇంకా పెద్ద రాజభవనం కట్టి ఈసారి 'బంగారు చెంబులు' కానుకగా ఇవ్వాలి' అన్నాడు.

'వెంకీ' చిరునవ్వు నవ్వేడు. కళ్ళు వినయం గానో, గర్వంగానో కిందకు చూశాయి. అప్పుడు గమనించాడు. అతను ధరించిన బట్టలూ - కాళ్ళ కున్న బూట్లూ. ఆ తర్వాత ఇంటికి తిరిగి వచ్చాక చుట్టుపక్కల వారందరికీ 'వెండి చెంబు' టాపిక్ ఆఫ్‌ది టౌన్ అయింది.

"ఎన్ని డబ్బులుంటే మాత్రం అంత బడాయా!" అనుకున్నవారూ - ముఖాన అన్న వారూ లేకపోలేదు.

రాంబాబు అందుకు కోపం తెచ్చుకోవా లనుకున్నా, "వెండి చెంబు" కలిగించిన ఆనందంలో పట్టించుకోలేదు.

గంట క్రితం ఒకతను వచ్చాడు. అతని చేతిలో ఓ దినపత్రిక వుంది. "అయ్యా - రాంబాబు గారూ. ఆ మజ్జెన మీకెవరో 'వెండిచెంబు' యిచ్చారని ఎగ్జిబిషన్ పెట్టారు కదా. అది యిచ్చింది వీరు కాదుగదా" అని ఓ ఫొటో చూపించాడు.

రాంబాబు గుండె పగిలింది.

"అబ్బే... ఆయన కాదు" అన్నాడు వెంటనే

"అవున్లెండి. తన పిత్రలు కాకపోతే కాశీదాకా దేకుతానన్నాడంట. ఈ మహానుభావుడు ఓ బేంకు పెట్టి - జనాన్ని కోట్లకు ముంచి పారిపోయా డంట. అతని కోసం, అతని అనుచరుల కోసం గాలిస్తున్నారంట" అని వెళ్ళిపోయాడు.

ఆ క్షణం నుండి మొదలయింది కంపరం.

తులసిని పిలిచాడు. ఇప్పుడా వెండి చెంబుని వుంచుకోవాలా - పారేయాలా అనేది తేల్చమన్నాడు. పారేయటం ఎందుకందావిడ. అది మన ఇంట్లో వుంటే మనల్ని కూడా పోలీసులు పట్టుకుపోతారేమో అన్నాడు. మనల్నెందుకు పట్టుకుపోతారు. మీదంతా పిచ్చి. అయినా మీకు అంత భయంగా వుంటే బయటపారేయండి అందావిడ.

అంతపని చేయాలనున్నా రాంబాబుకి చెయ్యి రాలేదు. కనీసం ఏ గొయ్యి తీసి దొడ్లోనో, గోడని పగలగొట్టి అందులో దాచి తిరిగి సిమెంట్ పూయించటమో చేస్తే భావితరాల వారి తవ్వకాల్లో వారికి దొరుకుతుంది కదా అనుకున్నాడు. ఒక్కడే గదిలో కూర్చుని ఆ చెంబుకేసి తదేకంగా చూశాడు.

తులసికి రాంబాబుని చూసి జాలి కలిగింది. అందుకే వేడివేడి కాఫీతో గదిలోకి వెళ్ళింది.

"ఇంతకీ మా 'వెంకీ' ఎక్కడున్నాడంటావ్?"



అన్నాడు.

"నా కెలా తెలుస్తుందండి" అంది.

"మనం వెండిచెంబు యిచ్చినప్పుడు తీసుకోకుండా వుండాల్సిందా?"

"అదేంటి?"

" ఇప్పుడు మన ఇంటిదగ్గరయితే పోలీసులు రారని వచ్చేస్తాడేమో"

"అంత తెలివితేటలున్నాయా?"

"అదే పిచ్చి ప్రశ్నంటే. తెలివితేటలు లేకపోతే ఇంతమందిని ఎలా మోసం చేస్తాడు" అన్నాడు రాంబాబు.

"ఇప్పుడు నాకు అర్థం అయిందండి వెండి చెంబు ఎందుకిచ్చాడో!"

" ఎందుకిచ్చాడంటావ్?"

" తిలాపాపం తలా పిడికెడని"

"అంటే ఈ వెండి చెంబు పాపం అంటావా?"

"కాక ఇంకేమిటి?" అంది తులసి.

"అలా అనకు. ఇందులో వెండిచెంబు తప్పే

ముంది. అంతా మనుషుల్లోనే వుంది" అన్నాడు.

"అట్లయితే మీరు ఇంక వెండిచెంబు గురించి ఆలోచించడం మానేయండి. దాన్ని నేను జాగ్రత్తగా బీరువాలో దాస్తాను"

***

అర్ధరాత్రి

రాంబాబు ఎందుకో ఉలిక్కిపడి లేచాడు. రాత్రిపూట బెడ్‌రూమ్‌లో బెడ్‌లైట్ కూడా వేసుకోకుండా పడుకుంటాడు. చాలాసార్లు తులసి బెడ్‌లైట్ వేసుకుందాం అన్నా 'నాకు నిద్ర పట్టదు' అని వూరుకునేవాడు కాదు. పైగా లైటుంటే దోమలు శరీరంలో ఏ ప్రాంతం మీద కావలిస్తే ఆ ప్రాంతం మీద వాల్తాయని రాంబాబు అభిప్రాయం.

తనెందుకు లేచాడో అర్ధం కాలేదు.

పీడకలా? కాదు!

పైన ఫ్యాన్ తిరుగుతోంది. కొంపతీసి దొంగ ఎవడన్నా వచ్చాడా... వాడికి వెండిచెంబు గురించి తెలిసే వుంటుంది. చుట్టుపక్కల వారంతా పైకి అనకపోయినా ఆ చెంబు గురించే చర్చించు కుంటున్నారేమో!

'పోతే పోనీ పీడా వదులుతుంది' అను కున్నాడు.

సరిగ్గా అప్పుడు వినిపించింది శబ్దం.

ఫోన్ మోగుతోంది.

రాత్రిపూట సౌంతం సౌండ్ తగ్గించి పెడతారు. బహుశా ఆ శబ్దానికే మెలకువ వచ్చి వుంటుంది. అయినా ఈ టైంలో ఫోన్ ఎవరు చేస్తారను కుంటూనే లిఫ్ట్ చేశాడు.

"హలో..."

"నేను వెంకీని రాంబాబూ"

"ఎక్కడనుండి?"

"ఆ వివరాలొద్దు. నే చెప్పేది విను"

"చెప్పండి"

"పేపర్ చూస్తున్నావు కదా. మొత్తం మేం ఆరుగురం ఓ చోట వున్నాం. ఒక్కొక్కరిని పట్టిస్తే అయిదు లక్షల చొప్పున మొత్తం ముప్పై లక్షలు వస్తాయి"

"అవును." "ఈ విషయంలో నువ్వు మాకు హెల్ప్ చేయాలి"

"నేనేం చేయగలను" కంగారుపడ్డాడు రాంబాబు

"నువ్వంత భయపడాల్సిన పనిలేదు. నీకు బంగారపు చెంబంటే ఇష్టం కదా!"

"ఇదివరకు ఇష్టమే"

"ఇప్పుడు కూడా ఇష్టమే. మేం విదేశాలకు పారిపోదాం అనుకున్నాం. అయితే జన్మభూమికి దూరంగా బతకలేం"

"అవునవును మాతృదేశం అంటే ఎవరికైనా ప్రేమే"

"అదొక్కటే కాదు. విదేశాల్లో నేరాలు చేయటం అంత సులభం కాదు. ఒకవేళ చేసినా, ఇంత కాలం దొరక్కుండా తప్పించుకోలేం. పైగా కఠిన మైన శిక్షలు వేస్తారు!"

"అలాగా!"

"అందుకే మేమందరం నీ ద్వారా లొంగిపోతాం. నీకు "బంగారు చెంబు" వస్తుంది.

"ముప్పై లక్షలకు బంగారం చెంబేనా... బిందె వస్తుందనుకుంటా"

***

ఆరోజు

'వెంకీ' అతని డైరక్టర్లు చిరునవ్వుతో జైలు నుండి బయటకు వచ్చారు. అప్పటికి 'రాంబాబు'కి వాళ్ళని పట్టించినందుకు రావలసిన డబ్బు ఇంకా అందలేదు.

'వెంకీ' చొరవతో ఆ ఫైల్స్ చకచకా కదిలాయి. ఆ రకంగా రాంబాబుకి 'బంగారపు చెంబు' వచ్చింది. ముప్పై లక్షలూ వెంకీకి వెళ్ళాయి.

'వెంకీ' సరదాగా 'స్విస్' వెళ్ళాడు.

**ముగింపు**

'వెంకీ' పెట్టిన బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేసినవారు ఇంకా వాటి కోసం తిరుగుతూనే వున్నారు.

'రాంబాబు'కి అవసరం వచ్చి 'బంగారు చెంబు'ని అమ్ముదామని వెళ్తే–

అది 'బంగారపు పూత మాత్రమే' అని చెప్పేరు.

అప్పుడు రాంబాబు ఇలా అనుకున్నాడు.

'సోదరా–అపూర్వం–అనితరసాధ్యం" *